

ప్రేమిస్తున్న స్త్రీ హృదయానికి యింతటి తిరస్కారమా? యింతటి పదాఘాతమా? ..... .....

నారీ హృదయంలో కూడా దావానలం వుంది. ఆ మండు నిప్పు లోకాలనే కాలజేసి తీసుతుంది....

ఈ తిరస్కారానికి ప్రతీకారం చేయకుండా యౌవన జ్వాల ప్రజ్వరిల్లుతూవున్న స్త్రీహృదయం వూరుకోగలదా?

# ప్రతీకారం

మూడేళ్ళ క్రితం తన్నువదలి విద్యకోసం విదేశాలకు వెళ్ళిన భర్త ఆరోజున తిరిగివస్తాడు తప్పకుండా వస్తాడు....వచ్చి తీరతాడు....ఆ విషయం ఆమె హృదయం స్పష్టంగా చాటుతోంది.

ఇంతవరకూ పతికోసం అత్యాతురతతో ఎదురుచూస్తున్న అమె విరహహృదయానికి నేడు శాంతి చేకూరుతుంది.

తను తన నిండు హృదయంతో భర్తను ఆహ్వానిస్తుంది. ప్రేమ పుష్పాలతో పూజిస్తుంది. నవమాసాలు మోసి కనిపెంచిన ప్రేమ ఫలాన్ని బహూకరిస్తుంది.......అతడామెను హృదయానికి జేర్చుకుంటాడు: తన పవిత్రసీఠంమీద ఆమె నధిష్టింపజేస్తాడు; ఆమె నారాధిస్తాడు....

ఆమె హృదయం ఆనందంతో వూగిసలాడుతుంది; ప్రణయవీధుల విహరిస్తుంది; ప్రేమామృతాన్ని కడుపార, తనివిదీరా....గ్రోలుతుంది.

* * *

జీవనప్రభాత్

కాలచక్ర మాగిపోయింది ఆమె విషయంలో. శృంగారానికి, అలంకరణకి అంతులేదు, ఆలసటలేదు—తృప్తిలేదు.

తన బిడ్డకు—తన కళాపాండితి వెదజల్లుతూ. కళావిశిష్టత్వాన్ని స్థిరపరుస్తూ అలంకరించింది.

చంకను "చంటి"ని యెత్తుకుని వీధి గుమ్మంలోనుంచుని—ఉరకలు వేస్తూన్న హృదయంతో, విప్పారిన కళ్ళతో, నవ్యగాన్ని వెదజల్లే చెక్కిళ్ళతో, అదరిపడే అధరాలతో—నాధుని ఆగమనంకోసం ఎదురుచూస్తోంది....ప్రేమమయిరాధ.

ఇప్పటికి అప్పుడే రెండేళ్ళపైనుంచి. రోజురోజూ పాఠాలుగా నేర్పింది, తన బిడ్డకు, రెండు పవిత్రనామాక్షరాలు. తన

స్థన్యంతోటే ఆ నామాక్షరాల, నాధుడి రూపు తన బిడ్డ హృదయంలో ముద్రింపించింది.

ఆ రూపును ఇప్పుడు నిరూపించి చూపు తుంది. తన పుత్రికకు—ఇన్నాళ్ళకి!—పితృ సందర్శనము చేయిస్తుంది....

అంతరిక్ష వనలక్ష్మి గులాబీఅంచుగల వంగపండు చీర ధరించింది. ఆమె బంగారు ముఖంపైన కుంకుమరేఖ స్పష్టంగా కాన వస్తోంది....పశువులు పాపలు ఇండ్లకు మరలుతున్నారు. అంబోతులు రంకెలువేస్తూ మందలోనుండి విడివడి పరుగులెత్తు తున్నాయి.

ఆకాశాన్ని కుంకుమరేఖలు నీలాల కాంతులలో లీన మవుతున్నాయి....

శ్రీపతి ఇంకా రాలేదు—

ప్రతికోసం గృహప్రాంగణంలో ఆశా పూరితనయనాలతో, ఎదురుచూస్తూవున్న శ్రీదేవి ఎదురుచూస్తోనేవుంది! హారతి ఇవ్వ ఆతురతపడుతున్న రాధిక అలానేవుంది!

* * *

ఇంకా రాలేదేం? ఇంకా రాలేదేం? ఇప్పటికప్పుడే యెప్పుడో రావలసిందేబండి —పొగబండి అలశ్యమయిందా? ఇటువంటి సమయాల్లో—అత్యాతురతగావున్న క్షణాల్లో, —ముఖ్యంగా....ఆ మరశీల విరిగిపోతుంది!

అమ్మయ్య—గుమ్మంలో బండీవచ్చి ఆగింది! 'చంటి'ని ప్రేమతో హృదయానికి అదుముకుంది. గబగబా రెండడుగులు ముందుకువేసింది, మామగారు బండీలోనుంచి దిగేరు. ఆమెను ఎక్కడలేని సిగ్గూ ఆవరిం చింది. చెక్కిళ్లు ఉష్ణతమమయ్యేయి. పాతాళంలోనికి తలదించివేసుకుంటూ. గిరు క్కున తిరిగి, చకచకా తలుపుచాటుకు పరుగులెత్తింది. ఉత్సాహంతో వెనక్కు త్రిగిచూసింది—

బండీ వెళ్ళిపోతోంది....మామగా రొక్కరే వున్నారు.

ఆమె హృదయం ఆగిపోయింది. ఆమె ఆశ నిరాశఅయింది. అమె శరీరం వణికి పోయింది—సజలమయింది—చంటి క్రిందకు జారిపోతోన్నట్లయింది—

నిజమే—మామగా రొక్కరే! ఒక్కరే- గుమ్మా లెక్కుతున్నారు, ఆయన చేతికర్ర విచారంతో నేలను తాకుతోంది; కర్ణకఠోరం గా శబ్దంచేస్తోంది. ఆయన కాలిజోళ్లు, ఎంతో శాంతంగా తలవంచుకుని వుండవల సిన ఆకు చెప్పులే! వికటంగా అపహాస్యం చేస్తున్నాయి.

ఆమె మాటలేక గుమ్మానికి ప్రక్కగా నిల్చుండి పోయివుంది. మామగారి వెన క్కాలే మెల్లగా వెళ్ళసాగింది. అతికష్టం మీద "రా—నే—లే—" అంది.

ఆమాటలు ఆయనకు వినిపించలేదు.

రాలేదు. అవును! తనకళ—తన పాండితి—నైపుణి—ప్రతిభ—శృంగారం ....అన్నీ ఈరోజుకు వృధా అయ్యేయి.... ముద్దు ముద్దు పలుకులతో ముంచెత్తుతూన్న బిడ్డకి—నాన్నని చూపించడం....?

* * *

నిరాశచెందిన హృదయంతో, వేడి నిట్టూ ర్పుల నాపుకుంటూ, 'చంటి'ని గట్టిగా భయంతో హృదయానికి హత్తుగుంటూ, శూన్యదృష్టులతో—

దుస్తులు విప్పుకుంటూవున్న మామగార్ని ఎదుర్కొన్నది. ఆమె నయనాలే ప్రశ్న పరంపరలు గురిపించేయి. ఆయన ముఖం కళావిహీనమయింది. ఎందుకో ఆయన ముంజేయి వణకింది. తనకోసం చేతులు చాపుతూన్న 'చంటి'ని ఆయన దృష్టులు గమనించ లేకపోయేయి....

"అచ్చే....వా—చ్చేడమ్మా..." అని చిరు దగ్గుతో, రెండో వైపుకు చూస్తూ అన్నాడాయన.

ఆమె హృదయం పరిపరివిధాల పోయింది, మోము వెలవెలబోయింది.

ఒచ్చేడు....కాని— పనుండి— ఎక్క డికో....—"

ఆమె హృదయం కుదటబడింది. "వెళ్ళేరా? అయితే రాత్రికి వస్తారా? భోజ నానికి వస్తారా?....స్నేహితులింటికా? ఎవరు చెప్మా! ఎవరయితేనేం గాని" ఒక నిట్టూర్పు విడిచింది, అప్రయత్నంగా ఒక్క చిరు నవ్వు—"మరి సామాన్లేవి? కూడా తీసు కెళ్ళేరా?"

ఆమె అమాయక ప్రశ్నల వర్షాలకి ఒక్క జవాబూ రాలేదు.

"అయితే—రాత్రికి రారా? రారు!.... రేపు?—రేపు! అమ్మయ్య—రేపొస్తారు...."

ఊ హృదయం ఎన్నిరోజులు వేగించ లేదు? ఇంక ఒక్కరోజు—కాదు, ఒక్క రాత్రి వేచి వుండలేదా?

కాని ఇంతబాధతో నిరీక్షణ చేయలేదు— ఎన్నడూ!

* * *

రాత్రి తెల్లవార్లూ 'చంటి' నాన్నని పలవ రిస్తోనే వుంది. ఆమెను వూరుకోబెట్టడం రాధకు కష్టమయింది.

'చంటి' నాన్నముఖం చూడకపోయినా తన మాతృదేవి హృదయకుహరంలో తను దాగివుండి, అతని హృదయమాధుర్యాన్ని చవిజూడ గలిగింది—ఇదివరకే—ఎప్పుడో! ఇప్పుడు— అతనికోసం రేవళ్ళు పలవరించే హృదయంలో తను లీనమై వుంది.

* * *

ఆరోజునా ఎందుచేత రాలేదో! ఊళ్ళోనే వుండికూడా! ఊళ్లోవుండే యెందుకు రాలేదూ? అదంతా పని తొందరా? ఇప్పుడు

తనకేం కొత్తపనివచ్చి పడింది?....ఎంత పని వుంటేమాత్రం ఇంటికి రాకుండానా? ఒక్కసారి చూసిపోతేనేం?—మూడేళ్ళయింది కదా!

ఇదంతా ఓ యెత్తులాగ కనబడుతోంది—లేక ఇది ఏదేనా పరీక్షా??.......

ఇంట్లో తన భర్త సంగతి ఎవరూ ఎత్తడంలేదు. అధమపక్షం తన దగ్గరనేనా కదపడంలేదు. ఆ విషయం అంత చింతపడినట్లేనా కనపడడం లేదు....

ఇదీ ఒక నటనేనేమో!

తను కనీకనపడడంతోనే మామగారు ముఖం మార్చుకుని ఎదో వొక లీలలో లీనమయిపోతారేం?

తను—తానై—ఈ సంగతి కదపాలి. ఏం? ఇంతట్లోకే సిగ్గెందుకు? పోనీ సిగ్గుతోనే కదిపేది....అలా వూరుకుంటే? ఎందుకూరుకోవాలి?—తనకి సంబంధించిన విషయంలో?

* * *

"అబ్బే—మీరేదో దాస్తున్నారు....మీరేమిటి?—ఇంటిల్లిపాదీను! చెప్పక తప్పదు. ఈ రోజున కాకపోతే రేపైనా సరే—!"

ఆయన నివ్వెరపోయేడు. ఇంత హటాత్తుగా ఈ సంఘట్టన జరుగుతుందని ఆయన అనుకోలేదు.—ఆఖరికి తన్ను తాను సంబాళించుకున్నాడు.

"అవును—ఈ రోజున కాకపోతే—రేపైనాసరే—" అని గొణుగుకున్నాడు. అతని దృష్టులు "నాన్నా—నాన్నా" అని పలవరిస్తూ. తొట్టిలో నిద్రపోతూవున్న 'చంటి' మీద పడ్డాయి.

గుండె ధైర్యం చేసుకున్నాడు—శరీరాన్ని గోడకు జేరగిలవేశాడు.

"ఇ....ం—ం—క...."

"ఇంక—?—ఏం? ఆగిపోయారేం?"

"ఇంక—వాడు ఇంటికి రాడమ్మా—"

"ఆ—?—అంటే—అయ్యో—"

"లాభం లేదు—"

"అంతేనా—అంతేనా!" ఆమె నేల కూలింది.

* * *

ఇంక తన భర్త రాడు. అసలు రాడు. ఆతని హృదయం తనదికాదు. అతని హృదయంలో తనకు స్థానంలేదు.

తను "చంటి"కి ఈ జన్మలో నాన్నని చూపించలేదు. "నాన్న?" అని అమాయకంగా అడిగినప్పుడు తానింకేమి చెపుతుంది.

ఇదివరకటి ఆశకూడా ఇప్పుడు లేదు కదా!

అసలు ఈ జీవితంలో ఆశఅనేదే అస్తమించింది. ఈ జీవితానికి ఉదయమింక రాదు. ఈ జీవితభాగ్యం నశించింది. ఇంక మిగిలింది భారమయజీవనం.

* * *

పూర్వ అపూర్వప్రణయాన్ని తలచుకునేనా ఆఖరిసారి తన్ని చూసిపోడా? పోనీ—తన్ని కాదు; తమ నిష్కల్మష ప్రణయవాహిని ఫలంగా జన్మించిన 'చంటి'ని ఒక్కసారి చూసి, "నేనే నీ తండ్రి"నని ఆ పాపకు తెలిపి వెళ్ళిపోడా?

ఏం, తనేమీ ఎక్కువ అడగలేదే—పోగొట్టుకున్న హృదయాన్ని తిరిగి పొంద ప్రయత్నించలేదే! రానన్నప్రేమని తిరిగి రమ్మనమని ప్రార్థించలేదే!

తను కోరేది—ఒక్క చూపు....ఒక్క క్రీగంటిచూపు—అదేనా తనని కాదు—తామిద్దరినీ బంధించి వుంచిన ప్రణయసాగర మధన ఫలితాన్ని ఒక్కమారు చూడమని....ఆ అమాయక అధరాలని ఒక్కసారి ముద్దిడుకోమని....

ఆ బిడ్డకి ఒక్కసారి పితృ సందర్శనం చేయించమని!

* * *

ఆ విధంగా కూడా ఆమె ప్రయత్నం నిష్ఫలమయింది. తను పంపించిన దూత, అతని దర్శనమేనా చెయ్యలేక, తిరిగివచ్చి నిశ్పృహతో తన యెదురుగా నిల్చివుంది..

తను పంపిన దీన విజ్ఞాపనం, దుఃఖమయ ప్రార్థన త్రోసిపుచ్చబడింది ...తన ఆహ్వానం నిరాకరింపబడింది....తను తృణీకరింపబడింది!

"ఒక్కవరలో రెండు కత్తులు యిమడవు—"

ఇదీ—అతని సమాధానం!

ఇంత తృణీకారమా? ఇదివరకు ఒక కత్తి వుండగానే వేరొక కత్తికోసం తనెందుకు ప్రాకులాడేడు? అలా పాతలు పారవేసి క్రొత్తలకు పరుగులెత్తవచ్చునన్న మాట! ఆ విధంగా ఎన్ని కత్తులేనా మార్చవచ్చునేమో!

కొంపతీసి—మళ్ళీ మరో'చాకు' మీదకి మోజు పోతుందేమో;

అయితే ఆ విసరిపారవేసిన కత్తి గతి? అది ఎండ వానల కేనా??....ఈ సంఘటన ఒక కోమల నారీహృదయాన్ని చీల్చి వేస్తోన్నదన్న సంగతి—అతను కొంచెమేనా గ్రహించేడా?

ఇంతకీ చంటిపిల్ల మాట ఏమన్నాడు! తన అసలు ప్రశ్నకి సమాధానం ఏం చెప్పేడు?....

"ఆమె—నా పిల్లే అయినా—ప్రస్తుతం దాని పిల్ల!"

ఆ—!?!

"ఎంతమాట!!

"ఆ విషయం అంత ఆలోచించ వలసింది కాదు—"

అంటే—?

ఆఖరికి ఇదా? ఇంత తృణీకారమా? ఇంతటి శిలామయమా?

ఈ నిష్కారణ తిరస్కారానికి—ఒక వేళ తిరుగులేకపోయినా—అంతకంటే తిరుగులేని ప్రతిఫలము ప్రతిలేని ప్రతీకార మని తెలియదా? ఈ తిరస్కారంవల్ల ఒక అమాయక హృదయం నిష్కారణంగా హింసింపబడుతోంది.

సంవత్సరాలతరబడి ఎదురుచూస్తూ వున్నందుకు మంచిప్రతిఫలం—పవిత్ర ప్రణయినీ ప్రతీక్షణకు! క్షణక్షణమూ యుగ యుగాలుగా గడిపి, దినదినమూ కల్ప కల్పాలుగా వేగించి, విరహాలోకాలలో నిద్రించి, వేచి వుండి, ఆశ అనే ప్రణయ పుష్పాలతో ఆరాధించి, తన ఆరాధన జ్యోతిని అడ్డాల బిడ్డగా ధరించి—దేశాన్ని విడిచి యేగి తిరిగి వస్తోన్న భర్తకి స్వాగత మివ్వబో తూన్న స్త్రీ హృదయానికి—

ఇంతటి తిరస్కారమా? ఇంతటి పదా ఘాతమా?

*　　　*　　　*

నారీ హృదయంలో కూడా దావానలం వుంది. ఆ మండునిప్పు లోకాలనే కాల జేసి తీరుతుంది. కాని ఆ హృదయాన్నే చుట్టుకొనివున్న వెన్ననిమాత్రం కరిగించ లేదు. ఆ వెన్నలేని స్త్రీ హృదయాలుండవు.

ఈ తిరస్కారానికి ప్రతీకారం చేయకుండా యౌవన జ్వాల ప్రజ్వరిల్లుతూవున్న స్త్రీ హృదయం వూరుకోగలదా?....

కాని ఆఖరి ప్రయత్నం చేసిన తర్వాతనే తన కక్ష సాధిస్తుంది.

*　　　*　　　*

అతను నివసిస్తూ వున్న గృహాన్ని వెతుక్కుంటూ, 'చంటి'ని చంకను వేసుకుని బయలుదేరింది. గుమ్మంలో నిలుచుని లోనికి కబురు పంపింది. తనలో నుండి ప్రజ్వరిల్లి వస్తూవున్న విప్లవాగ్నికణాలని ఆర్పు కుంటూ, అందుకు ఫలితంగా అలుముకు పోయిన సిగ్గుపొగచేత మనస్సు కప్పుకుని, చంపుకుని, న్యాయశిక్షణకై యెదురుచూసేటి అపరాధినివలె నిల్చుని వుంది.

జవాబు తెచ్చినది ఒక యువతి. హంస యానంతో రాధను కలుసుకుంది. ఆమె గృహజమానురాలు. ఒక వంగవనిత.

రాధ ఒక్కడుగు ముందుకువేసి—"ఈ చంటిపిల్లకి ఒక్కమారు తండ్రిని చూపించేం దుకు వచ్చేను."

"ఇప్పుడు వీలుండదు":

ఆ కరకుసమాధానం రాధనేమీ చెయ్య లేదు. "నన్ను చూడవలసిన అవసరంలేదని చెప్పండి. రానిఫలంకోసం ఆశించను. ఈ చిన్ని కోర్కె మన్నించేరంటే— ఒక్క క్షణం నేను తప్పుకుని నిల్చుంటా—ఒక్క సారి పిల్లనిచూసి—మా ఉషనిచూసి— ఒక్క ఒక్క ముద్దుపెట్టుకుని, ఈ జీవితానికి ఒక్కటే ఒక్కసారి—అదే తొలిసారి, కడసారి—ఈ బిడ్డని హృదయానికదుము కుని, పితృ సందర్శనం ఒక్కసారి కలగ జెయ్యండి....అంతే—అంతే!"

ఈమాటలంటోంటే ఆమె హృదయం కలగిపోయింది, కుమిలిపోయింది. కళ్ళ నీళ్ళు జాలువారు కావలసిందే—కాని, గంభీ రంగా, తన శక్తినంతా వినియోగించి నిల బడగలిగింది....

ఈమాటలు ఆయువతిని కదల్చి వేశాయి. ఈమె హృదయ సౌందర్యం ఆమెను ముం చెత్తువేసింది. కాని, ఆమె కేవలం వార్తా వహురాలు....

"ఆయన చూడరు....నిశ్చయంగా చూడ రుట! నా ప్రయత్నమంతా——"

మరి ఆమాటలను వినిపించుకోలేదు. తన తలను తరిగివేసినట్లుగా భావించుకుంది. గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

దారిలో తల్లితో తండ్రిని గురించి పలవ రించింది, చంటి రెండు మూడుమార్లు.... 'శకుంతల' ని తలచుకుని రాధ ఏడ్చింది....

అది ఏకాలమోగాని—జోరున వర్షాలు మాత్రం కురుస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా గదిలో చీకటిగావుంది. మంచాని కంటుకు పోయి రాధవుంది. ఆమె ప్రక్కనే నిద్రి స్తూన్న 'ఉష!'

ఆరిపోయే దీపం మాదిరివుంది రాధ మొహం,

తడిసి ముద్దయిన బట్టలతో, అతి ఆదు ర్దాగా ప్రవేశించేడు మామగారు, రాధ దగ్గిర వంగుని హీనస్వరంతో అన్నాడు; "అమ్మా! వొచ్చేడు!"

ఆమె 'ఎవర' న్నట్లు ఒక్కసారి కను రెప్పలు తెరచిచూసింది.

"అబ్బాయి!—వొచ్చేడు."

"నే పిలవమని చెప్పలేదే—!"

"నేనూ నానోటితో పిలవలేదు—నీ సం గతి చెపుదామని వెడుతున్నా, నాకు వాళ్ళే ఎదురయ్యేరు."

"అలాగా—"

"ఆవిడా వచ్చింది!"

"అయితే ఆయన్ని గదిలోకి రావడానికి వీల్లేదని, ఆమెని ఒక్కసారి రమ్మనండి. ఆయనకి ఇందులో ప్రవేశించడానికి హక్కు గాని, అర్హతగాని లేదు."

అతను తెలతెలబోయేడు.

వంగవనిత మెల్లగావచ్చి నిలుచుంది.

"నేను మీ సహాయమేమీ ప్రార్థించ లేదు........"

"ఆయన పశ్చాత్తాపపడుతున్నారు!"

"ప్రతీకారం అనుభవించడానికా?" చిరునవ్వుతోఅంది, "అయినా అంత అవసరం కంపించడంలేదు."

ఆ సమయానికి గదిగుమ్మంలో నుంచి 'రాధా' అని ఒక హీనస్వరం వినబడింది. వడివడి తడబడే అడుగులు ఆమెకు వినబడ్డాయి. తలను రెండోవేపుకి త్రిప్పుకుంది. అతను దోషిలాగ గదిలో ప్రవేశించేడు. అప్పుడే కళ్ళు విప్పిన ఉష అతన్ని అనవాలు కట్టింది, "నాన్న" అని తన పరిభాషతో పిలుస్తూ తల్లితో మాట్లాడబోయింది. తల్లి కదలలేదు.

వంగవనిత రాధ ముఖంకేసి చూసింది. రాధ కళ్ళు మూతలు పడివున్నాయి.

అతను అమెను సమీపించేడు. కళ్లనీళ్ళతో పిల్లను అందుకుని, క్షమార్పణ కోరుకునేటందుకు ఆమె ముఖం తనవైపు త్రిప్పుకున్నాడు—

కాని, తల పట్టుతప్పి పడిపోయింది—

ఆమె క్షమించలేదు—

సరికదా—

తిరస్కరించింది!—ప్రతీకారం చేసింది.

*  *  *


కాని, బిడ్డకి పితృ సందర్శనం అయింది! అంతే!

క్షమార్పణ—తృణీకారం!

ప్రతీకారం—....

ప్రతిఫలం?

సందర్శనం!

# టి. సి. ఎన్. గోల్డెన్ మెటల్ నగలే

స్త్రీల కన్నివిధాల అలంకారానికి తగినవి.

2 సంవత్సరములు గ్యారంటీ

కాంతిలోను, వన్నెలోను బంగారుగాజుల కేమాత్రము

తీసిపోవు. నలుపెక్కవు.

| | |
|---|---|
| పెద్దసైజుగాజులు 2 అంగుళములనుండి పైబడినవి జత 1-కి | రూ. 3 0 0 |
| మధ్యసైజుగాజులు 1¾ నుండి 2 అంగుళములకులోగా జత 1-కి | రూ. 2 8 0 |
| చిన్నసైజుగాజులు 1¾ అంగుళములకు లోబడినవి జత 1-కి | రూ. 2 0 0 |
| వి. పి. ఖర్చులు 1 జత మొదలు 6 జతలవరకు | రూ. 0 8 0 |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

గాజులకు ఆర్డరుచేయువారు తాము వుపయోగించెడు గాజులలో చుట్టుకొలతను సిరాతో మార్కుచేసి పంపవలయును. లేక అడ్డుకొలత పంపవలయును.

N. B. మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు "చిత్రగుప్త" పత్రికపేరు నుదహరించిన మా ధరలమీద రూపాయకు 1 అణావంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండ్ కో., 280. వాల్‌టాక్సురోడ్, పి. టి. మద్రాసు.

ఏజంట్లు:—

గుప్తా అండ్ కో. మెయిన్‌రోడ్, కాకినాడ.

కె. వి. రమణమూర్తి, తెనాలి.

యస్. యస్. గుప్తగారు, జనరల్ ఏజంటు, మడకశిరా.

